ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : విద్యార్థులకు అందించే మెనూలో క్వాలిటీ, క్వాంటిటీ పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలు, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చలి కాలం అయినందున వేడినీళ్లు అందించాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే టీ సౌకర్యం కల్పించడంతో పాటు, పోషకాహారం సరిపడా అందించేలా చూడాలని సూచించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విద్యార్థులు కోరగా, త్వరలోనే ఏర్పాటు చేస్తామని, కావాల్సిన పుస్తకాల జాబితా ఇవ్వాలని విద్యార్థుల సూ చించారు. ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూడాలని, బియ్యం, సరుకులు నాణ్యత లేకుంటే తక్షణమే మార్చాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఎస్సీ హాస్టల్‌లో సీసీ కెమెరాను పరిశీలించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శైలజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు, సహాయ బీసీ సంక్షేమ అధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టే అంశంపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవో, టీఏ, ఈసీలతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రానున్న మూడు నెలలు ఉపాధి హామీ పనులు చేపట్టడం చాలా కీలకమని తెలిపారు. వేతన రేటు పెంచేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉండాలని సూచించారు. డేటా ఎంట్రీ మల్హర్ మండలంలో 18 శాతం, కాటారం 21 శాతం మాత్రమే పూర్తి చేశారని, వేగం పెంచాలని తెలిపారు. మున్సిపాలిటీలో 118 మంది డేటా నమోదు చేస్తున్నారని, అవసరమైతే ఆ సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. డేటా ఫారాలు కేంద్రంలోనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. బయటికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, డీపీవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

- సన్నాహక సమావేశానికి స్వచ్ఛందంగా తరలిన గులాబీ దండు
- మనోధైర్యాన్నిచ్చిన మానుకోట మీటింగ్
- అంతర్మథనంలో పార్టీ వీడిన నేతలు

జయశంకర్ భూపాలపల్లి. నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ జిల్లా శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నది. పార్టీ ఓటమితో నిరుత్సాహంలో ఉన్న క్యాడర్‌లో ఇప్పుడు ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. మొన్న జరిగిన మానుకోట మీటింగ్‌కు హాజరైన జనం.. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం గులాబీ దండులో మనోధైర్యాన్ని నింపింది. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. జిల్లా ఇన్‌చార్జి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రసంగం శ్రేణుల్లో కొత్త జవసత్వాలు నింపింది. సమావేశం కొనసాగినంతసేపు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కడం, జనంలో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణతో బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలు అంతర్మథనంలో పడ్డారు.

దీక్షా దివస్‌కు సన్నద్ధం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచి, గ్యారంటీలను తుంగలో తొక్కి ప్రజల్లో నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా విజయోత్సవ సంబురాలు జరుపుకుంటుండగా .. కాంగ్రెస్ పనితీరును ఎండగడుతూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు దీక్షా దివస్‌ను విజయవంతం చేయడానికి సిద్ధమవుతున్నారు. రేపు జిల్లా కేంద్రంలో జరుగబోయే దీక్షా దివస్‌కు సైనికుల్లా కదిలి వచ్చేందుకు చేయి చేయి కలుపుతున్నారు. మంగళవారం జరిగిన సన్నాహక సమావేశానికి ముఖ్యనేతలు వంద మంది హాజరుకావాలని గండ్ర పిలుపునివ్వగా 700పైగా నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. రేపు దీక్షా దివస్ 2 వేల మందితో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీక్షా దివస్‌కు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ముఖ్యఅతిథిలుగా హాజరుకానున్నారు. బస్టాండ్ సమీపంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి అంబేద్కర్ సెంటర్లో అమరవీరులకు నివాళులర్పిస్తారు. అంబేద్కర్, జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించండి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- వరంగల్, కరీంనగర్ డీసీసీబీ డీజీఎం, ఏజీఎంలతో సమావేశం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : రైతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటుపై రెవెన్యూ, సహకార, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, వరంగల్, కరీంనగర్ డీసీసీబీ డీజీఎం, ఏజీఎంలతో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలు, రైతుల సంక్షేమం కోసం నూతన బహుళార్థ మత్స్య, గొర్రెల పెంపకందారులు, వ్యవసాయ, ఉద్యాన, కల్లుగీత కార్మికులు, మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎనిమిది నూతన బహుళ ప్రయోజన సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం ఉందని, వీటి ద్వారా రైతుల కు ఇన్ పుట్ సబ్సిడీలు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం సహకార శా ఖ ఆధ్వర్యంలో 10సహకార సంఘాలున్నాయని, అదనంగా 8బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో 123, జిల్లా సొసైటీ 1లో మత్స్యకారుల సంఘాలు న్నాయని చెప్పారు.

పశు సంవర్ధకశాఖ పరిధిలో 154, వ్యవసాయ శాఖ పరిధిలో 8రైతు ఉత్పత్తి సంఘాలున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సహకార శాఖ అధికారి వాల్యా నాయక్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఉద్యానవన శాఖాధికారి సంజీవరావు, పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వా మి, మత్స్య శాఖ అధికారి అవినాశ్, కరీంనగర్ డీసీసీబీ డీజీఎం బ్రహ్మానందరావు, వరంగల్ డీసీసీబీ ఏజీఎం స్రవంతి, నాబార్డు డీడీఎం రవి పాల్గొన్నారు.

అధికారులు ఐకమత్యంతో ఉండాలి

ములుగురూరల్, నవంబర్ 27 : అధికారులు ఐకమత్యంతో ఉండాలని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌రావు అధ్యక్షతన అసోషియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యవర్గ సమావేశంలో వివిధ శాఖల్లో ఉన్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. శనివారం హైదరాబాద్‌లో జరుగనున్న స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి తెలియజేయాల్సిన సమస్యలపై ఆరా తీశారు. అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ అధికారులకు ఎలాంటి సమస్యలు వచ్చినా అందరూ కలిసి ఉండాలని అన్నారు. అనంతరం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ వద్ద ఆర్డీవో రత్న కల్యాణిపై జరిగిన దాడిని ఖండించారు. సమావేశంలో కోల రాజేశ్‌కుమార్, సెక్రటరీ జీవన్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కెమసారం కొమురయ్య, సంతోశ్, శ్రీనివాస్, శైలజ, రహీమ్, రాజ్‌కుమార్, యశ్వంత్, దుర్గారావు, రంజిత్, శంకర్‌రావు, బాలయ్య, నరసింహ, సారంగపాణి, రాజేశ్వర్, శిరీష, నరసింహ, విద్యాసాగర్, మాధవి, శీతల్, రాజేశ్వర్ రావు, రాజు, రహీమ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీధర్

చిట్యాల, నవంబర్ 27 : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బానోత్ శ్రీధర్ ఎంపికైనట్లు ఎంఈవో కోడెపాక రఘుపతి తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 100, 400, 600 మీటర్ల పరుగులో లాంగ్ జంప్, జావలిన్ త్రో విభాగాల్లో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి చెప్పారు. శ్రీధర్‌కు పాఠశాల పక్షాన స్పోర్ట్స్ షూస్ అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరామ్ రఘుపతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు కూచనపల్లి శ్రీనివాస్, బొమ్మ రాజమౌళి, సరళాదేవి, నీలిమారెడ్డి, బుర్ర సదయ్య, మోరిశెట్టి, సుజాత, రామనారాయణ, విజయలక్ష్మి, మురారి కల్పన, గడ్డం శంకర్, తుమ్మ మౌనిక, భాస్కర్, కాంప్లెక్స్ సీఆర్పీ రాజు పాల్గొన్నారు.

లక్ష్మీ బరాజ్‌కు కొనసాగుతున్న వరద

మహదేవపూర్, నవంబర్ 27: లక్ష్మీ (మేడిగడ్డ)బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. 16.17 టీఎంసీ నీటినిల్వ సామర్థ్యం ఉన్న బరాజ్‌కు బుధవారం ఇన్ ఫ్లో 30,100 క్యూసెక్కులు రాగా, బరాజ్ మొత్తం గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రవాహం బరాజ్ రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 89.50 మీటర్ల ఎత్తులో ఉంది. వరద ప్రవాహం తగ్గే అవకాశం ఉందని భారీ నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

పైపులైన్ మరమ్మతులను పరిశీలించిన ఎంపీడీవో

గణపురం, నవంబర్ 27 : మండలంలోని చెల్పూర్ జీపీ పరిధిలో విద్యుత్ స్తంభాల మరమ్మతులో భాగంగా గ్రామంలోని ప్రధాన నల్లాల పైపులైన్ పగిలి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బుధవారం పంచాయతీ కార్యదర్శి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది చేపడుతున్న పనులను ఎంపీడీవో భాస్కర్ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పొన్నం రఘు, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

95కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఏటూరునాగారం, నవంబర్ 27 : గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్న భూటారం గ్రామాన్ని తుపాకుల గూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కకు తరలించి 95 కటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పెసా గ్రామ సభలో తీర్మానం చేశారు. గిరిజన కులపెద్ద సోలం చొక్కారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పెసా గ్రామ సభకు కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 150 మంది గిరిజనులు హాజరై 1986 నుంచి 2023 వరకు వచ్చిన గోదావరి వరద సమస్యలు వివరించారు. గ్రామసభలో ఎంపీవో కుమార్, కార్యదర్శి రమాదేవి, కులపెద్ద సోయం కన్నయ్య, పెసా నాయకులు వెంకటనారాయణ, సోయం లక్షణ రావు, ఇరిగేషన్ శాఖ అధికారి బుచ్చిమల్లు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం గొప్ప విషయం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : పేదల జీవనోపాధికి సహాయం అందించడం గొప్ప విషయమని పరకాల మార్కెట్ మాజీ చైర్మన్ చాడ రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మోరంచపల్లి గ్రామంలో ది రే ఆఫ్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోరం రవీందర్‌రెడ్డి ప్రోద్బలంతో బోరెడ్డి జితేందర్‌రెడ్డి, సంపత్, సురేందర్‌రెడ్డి, హారిక, రామ్మూర్తి అందజేసిన తోపుడు బండ్లను స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూకల నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ లకిడా కమలా వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ సండేసార్ రాజేశ్వర్‌రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు చేయాలి

నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ పీ శబరీశ్

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగురూరల్, నవంబర్ 27 : బా ధిత ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ పోలీసు అధికారులకు సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నెలలో నమోదైన కేసుల వివరాలను స్టేషన్‌ల వారీగా పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా ఉండాలని, సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను నివారించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులను, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేసి పోగొట్టుకున్న నగదు, వస్తువులను బాధితులకు అప్పగించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలతోపాటు, ఇతర మహిళలపై జరిగే నేరాల్లో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అమ్మే, తరలించే వారిపై నిఘా బలోపేతం చేసి ములుగును గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చే యాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమీక్షలో అదనపు ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, కుమార్, ఎస్‌బీ సీఐ అజయ్, సీసీఎస్ సీఐ రమేశ్, ఎస్సైలు వెంకటేశ్వర్ రావు, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజోద్దీన్, సురేశ్, హరీశ్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, డీసీఆర్‌బీ ఎస్సై జగదీశ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణలో 32వ స్థానంలో భూపాలపల్లి

భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : క్షయ వ్యాధి నియంత్రణ చర్యల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 32వ స్థానంలో ఉన్నదని, దీనిని ఇంప్రూవ్ చేయాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో క్షయవ్యాధి నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొగుళ్లపల్లి, అంబటిపల్లి, భూపాలపల్లి, వెలిశాల, ఒడితలలో క్షయవ్యాధి లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణలో స్ఫూటం పరీక్ష ముఖ్యమని, స్ఫూటం సేకరణలో క్వాలిటీ అండ్ క్వాంటిటీ మెయింటైన్ చేయాలని స్పష్టం చేశారు. డిసెంబర్ 2నుంచి లెప్రసీ ప్రోగ్రాం ప్రారంభమవుతుందని, ప్రతి ఇంటిని సందర్శించి మొద్దు బారిన, స్పర్శ లేని, మచ్చలున్న వ్యక్తులను గుర్తించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. క్షయ లక్షణాలున్నట్లు గుర్తించిన వ్యక్తులకు తక్షణమే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్ కుమార్, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంత్రి సీతక్కకు అంబేద్కర్ యువజన సంఘ, దళిత సంఘాల డిమాండ్

మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

మంగపేట, నవంబర్ 27 : మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయగానే వచ్చి ఆవిష్కరించిన మంత్రి సీతక్క ఆ విగ్రహం స్థానంలో అంతకుముందు ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని అక్రమంగా తొలగించిన వారిపై చర్యలు తీసుకొని తన చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు అంబేద్కర్ యువజన, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి మరో విగ్రహాన్ని పెట్టి ఆవిష్కరించడాన్ని ఆపాలని జాతీయ మానవ హక్కుల కమిషన్, కోర్టు పంపిన నోటీసులను బేఖాతరు చేస్తూ మంత్రి విగ్రహావిష్కరణ చేయడాన్ని వారు తప్పుపట్టారు. సమస్యను పరిష్కరించే స్థాయిలో మంత్రి ఉండికూడా సమస్యను మరింత జఠిలం చేయడం సమంజసమా..? అని ప్రశ్నించారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం తొలగించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సీతక్క తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించే దిశగా అధికార యంత్రాగానికి ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో అంబేద్కర్ విగ్రహ దాత చిట్టిమల్ల సమ్మయ్య, దళిత సంఘాల నాయకులు పూసల నరసింహ రావు, యాసం హరీశ్, జానపట్ల జయరాజ్, గుగ్గిళ్ల సురేశ్, గాజర్ల రాజు, గుగ్గిళ్ల నరసింహ రావు, ఎంపెల్లి మల్లేశ్, యాసం ప్రశాంత్, ఎంపెల్లి సతీశ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలి


వనభోజనాలు చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

మంగపేట, నవంబర్ 27 : ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి రమేశ్, కార్యదర్శి అనంతుల కృష్ణమూర్తి, కోశాధికారి పాలడుగు చంద్రశేఖర్, రాష్ట్ర నాయకుడు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కమలాపురం ఇంటేక్‌వెల్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఆర్య వైశ్య మహాసభ సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నా రు. అధ్యక్షుడిగా సిద్ధంశెట్టి కనకారావు, ప్రధా న కార్యదర్శిగా అనంతుల రవిగుప్తా, కోశాధికారిగా సింగిరి కొండ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నా రు. కమలాపురానికి చెందిన కృష్ణమూర్తి, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేశారు. నూతన కమిటీ బృందాన్ని సన్మానించారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు మాటిశెట్టి రాజమౌళి, భాస్కర్, కృష్ణమూర్తి, నరెళ్ల బతుకయ్య, నర్సయ్య, శ్రీనివాస్, రాజు, గార్లపాటి సత్యం, శ్రీనివాస్, గుండా సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, చిదురాల సతీశ్, పిల్లమారి సుధాకర్, గుండా రమేశ్, మాఘం సద్గురు, ఆయా గ్రామాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఎందుకు..?


నవాబుపేట కొనుగోలు కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు

చిట్యాల, నవంబర్ 27 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులు గడుస్తున్నా ఎందుకు జాప్యం అవుతున్నదని బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు వల్లబోజు నరేశ్ అన్నారు. బుధవారం ఆయన నవాబుపేట గ్రామంలో రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడిగా కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనకపోడం వారి వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాద రాజు, కత్తెరశాల రాజయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిళ్ల సం పత్‌రెడ్డి, మహ్మద్ రఫీ, ఇసం పెల్లి రాములు, చెక్క శ్రీనివాస్, ఎండీ హైమత్, పప్పు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి

- న్యాయం చేయాలని బంధువుల ధర్నా
- గంటపాటు ట్రాఫిక్ జామ్
- శాంతింపజేసిన పోలీసులు


వనం రాజు(ఫైల్)


ములుగులో ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

ములుగురూరల్, నవంబర్ 27 : ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని గట్టమ్మ శివారులోని పానిషా వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలానికి చెందిన వనం రాజు(33) అనే వ్యక్తి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. బుధవారం ఉదయం విద్యుత్ స్తంభాల తీగలను లాగే పని చేసేందుకు తన బైక్‌పై ములుగుకు వస్తుండగా గట్టమ్మ శివారు పానిషా వద్దకు చేరుకోగానే హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపునకు ఇసుక లోడ్ కోసం వెళ్తున్న టీఎస్ 06 యుఏ 5139 గల లారీ వేగంగా వచ్చి రాజు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ములుగు ప్రభుత్వ ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించారు. సాయంత్రం మృతుడి భార్య స్వప్న, బంధువులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వీరికి సీపీఎం పార్టీ నాయకులు గఫూర్‌పాషా, ప్రవీణ్, రవీందర్, సద్దాంహుస్సేన్ మద్దతుగా బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై సుమారు గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు ధర్నా వద్దకు చేరుకొని మృతుడి బంధువులను, సీపీఎం నాయకులను శాంతింపజేశారు. పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చేస్తామని వివరించారు. దీంతో మృతుడి భార్య వనం స్వప్న ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వర్‌రావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా, మృతుడు రాజుకు చిన్నారులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం

కాటారం, నవంబర్ 27 : మండలంలో కేంద్ర సచివాలయ ట్రైనీ సెక్షన్ ఆఫీసర్ల బృందం సభ్యులు అమిత్ చౌదరి, అంకిత్ గుప్తా, కృష్ణ టాప్పో, ప్రవీణ్ తాయల్, అనూప్‌సింగ్, అరవింద్ కుమార్‌సింగ్ బుధవారం పర్యటించారు. కాటారం, నస్తూర్‌పల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ తదితర పనులను సందర్శించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి పనులు, చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ వస్తున్నదా లేదా అని వివరాలు సేకరించారు. వారివెంట ఏపీవో వెంకన్న, ఈసీ మెంబర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ మనోజ్, పంచాయతీ కార్యదర్శులు షఫీర్ ఖాన్, సురేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేశ్ ఉన్నారు.

పెరటికోళ్లు పంపిణీ

వాజేడు, నవంబర్ 27 : మండల మహిళా సమాఖ్య పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు 53మందికి ఇందిరా మహిళా శక్తి తెలంగాణ సంబురాల్లో భాగంగా పెరటికోళ్లను బుధవారం డీపీఎం లీలాకుమారి, ఏపీఎం లక్ష్మీదుర్గా పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారురాలికి 20కోళ్ల చొప్పున, కోడిపిల్లకు రూ.160రూపాయల ఖర్చుతో మొత్తం రూ.16,800లకు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు మల్లాచారి, శంకరమ్మ, సత్యనారాయణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సమ్మక్క, సభ్యులు రమాదేవి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మాక్ టెస్టులకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 27 : గ్రూప్ –2 పరీక్ష కోసం రెండు ఫ్రీ ఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహించేందుకు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి మాక్ టెస్టు డిసెంబర్ 2,3 తేదీల్లో, రెండో టెస్ట్ 9,10 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా చూడాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

కాటారం, నవంబర్ 27 : సర్వేలో సేకరించిన వివరాల ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని జడ్పీ సీఈవో, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమెవెంట ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి ఉన్నారు.

హెల్త్‌సెంటర్‌ను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఏటూరునాగారం, నవంబర్ 27 : రొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని రెండో హెల్త్ సబ్‌సెంటర్‌ను బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్ టీకాల నియంత్రణ అధికారి రణధీర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక

ఏటూరునాగారం, నవంబర్ 27 : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో 9వ తరగతి అభ్యసిస్తున్న కే కృష్ణ అనే బాలిక ఈనెల 26న పునరుత్పాదక శక్తి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బాలికను నిర్వాహకులు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కృష్ణను హెచ్‌ఎం సాంబశివ రావు, అధ్యాపకులు అభినందించారు.

న్యాస్ పరక్ సర్వేను విజయవంతం చేయాలి

ములుగురూరల్, నవంబర్ 27 : డిసెంబర్ 4వ తేదీన జరిగే న్యాస్ పరక్ సర్వేను జిల్లాలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ విజయవంతం చేయాలని డీఈవో పాణిని సూచించారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాల ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో మొత్తం 140మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ఈ సర్వేను చేపట్టనున్నారని తెలిపారు. అనంతరం వారికి ఆయన సర్వేపై పలు సూచనలు చేశారు. ఈ శిక్షణలో జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

గణపురం, నవంబర్ 27: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గుండు స్వామి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. పరకాల పులిగిల్ల గ్రామానికి చెందిన మహిళతో స్వామికి వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని కారణాలతో పదేళ్లుగా వారు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో స్వామి భార్య వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో స్వామిపై కేసును పెట్టింది. దీంతో స్వామి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ జైలుకు కూడా పోయివచ్చాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కుటుంబ సభ్యులు ములుగు సామాజిక ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం, నవంబర్ 27 : కాటారం–మంథని ప్రధాన రహదారిలో ధన్వాడ గ్రామ పంచాయతీ కిష్టంపేట గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దేవేందర్ ద్విచక్ర వాహనంపై వెళ్తు రహదారి పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో దేవేందర్ తలకు గాయాలవగా 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూ కబ్జాలో నలుగురిపై కేసు నమోదు

ములుగు, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : భూ కబ్జాలకు పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్ రావు తెలిపారు. బండారుపల్లి రోడ్డులోని కృష్ణకాలనీ వద్ద ఎండుగ సుధాకర్‌కు చెందిన నాలుగు గుంటల భూమిని దుర్గం రమణయ్య, బైకాని సాగర్, మాదం సాగర్, బాషబోయిన రమేశ్ ఈ నెల 19న కబ్జా చేసేందుకు ప్రయత్నించి ఖాళీ స్థలంలో ఉన్న దుకాణం డబ్బాను జేసీబీతో తొలగించారు. బాధితుడు సుధాకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ నెల 22న సదరు వ్యక్తులను అరెస్టు చేసి ములుగు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడే వారిపై చట్ట రీత్యా చర్యలు తప్పవని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

వేడి నీటిలో పడి బాలుడికి గాయాలు

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 27 : వేడి నీటిలో పడి బాలుడికి గాయాలైన ఘటన మండలంలోని శాంతినగర్‌లో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బాలుడు తాడి దేవీ ప్రసాద్ ఆడుకుంటూ వెళ్లి ఇంట్లో హీటర్‌తో వేడవుతున్న నీటిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. తల్లిదండ్రులు గమనించి బాలుడిని మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి ములుగు ప్రభుత్వ దవాఖానకు రెఫర్ చేశారు.

కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో

టేకుమట్ల, నవంబర్ 27 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)ని బుధవారం ఎంఈవో సిద్దిరాల సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల హాజరును పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, క్వాలిటీ ఫుడ్, మెనూ, స్టాక్ రిజిస్టర్, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, వాటర్, స్కూల్ క్యాంపస్, ఆహార నిల్వలు, కూరగాయలు, వంట సామగ్రి, భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు, హెల్త్ చెకప్‌పై ఆరా తీశారు. వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో స్పెషల్ క్లాస్‌లపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, అకౌంటెంట్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దెముత్తారం తండాలో కార్డన్ సెర్చ్

చిట్యాల, నవంబర్ 27 : మండలంలోని గిద్దెముత్తారం తండాలో బుధవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. సుమారు 50 ఇళ్లను తనిఖీ చేసి 60 లీటర్ల గుడుంబా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామానికి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని, ఏదేని సమస్య వస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో చిట్యాల సెకండ్ ఎస్సై ఎండీ షాఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాటారం, నవంబర్ 27 : గిరిజన శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగం చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కాటారం గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో (బాలురు, బాలికలు) చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూల్‌సింగ్ మాట్లాడుతూ 25ఏండ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1,804మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 491 మంది కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగులు, గిరిజన సహకార సంస్థల్లో 94మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య , పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా రాజు, వేల్పుల సంపత్, దోమ రామకృష్ణ, మంతెన శ్రీనివాస్, కృష్ణమాచారి, సర్దార్ సింగ్, స్వప్న, పద్మ, రజిత, రాజశేఖర్, యాకమ్మ, రజిత, నాన్ టీచింగ్ స్టాఫ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

టేకుమట్ల, నవంబర్ 27 : మండలంలోని అంకుషాపూర్, దుబ్యాల, టేకుమట్ల గ్రామాల్లో ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని నాగరాజు ఇంటి వద్ద 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565